# కాంగ్రెస్ కర్షకుల ప్రభుత్వం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూలై 18 : కాంగ్రెస్ పార్టీ కర్షకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రుణమాఫీ విడుదల సందర్భంగా మండలంలోని రామాపురం రైతువేదిక వద్ద రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సంబురాల్లో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడుత రుణమాఫీ విడుదల చేయగానే ఎద్దుల బండిపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల


సీఎం వీసీని వీక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రుణమాఫీలో భాగంగా మొదటి విడుతగా రూ.లక్షలోపు మాఫీ చేసినట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, గృహజ్యోతి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

## సరిగా రాలేదు..



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఒకే దఫాలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇచ్చిన కొద్దోగొప్పో కూడా సరిగా రాలేదు. నాకు రెండున్నర ఎకరాలు ఉంది. ప్రాథమిక సహకార సంఘంలో రూ.90వేలు రుణం తీసుకున్నా. మొదటి విడుతలో రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని చెప్పారు. రుణమాఫీ లిస్ట్‌లో నాపేరు లేదు. ఏ విధంగా రుణమాఫీ చేస్తున్నారో అర్థం కావడం లేదు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి.

*- బిట్ల సత్యనారాయణరెడ్డి, మర్రిపల్లి, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*


ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

నవాబ్‌పేట, జూలై 18 : కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొల్లూరులో గురువారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ పటిష్టతకు కృషి చేద్దామన్నారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని, అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, నాయకులు రఘు, సేవ్యానాయక్, రఘుగౌడ్, లింబ్యానాయక్, నాగ అంజయ్య, రత్నబాబునాయక్, మాధవులు, నరేశ్, సక్రూనాయక్, ప్రవీణ్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.


# ప్రచారం కొండంత రుణమాఫీ కొంత

- గందరగోళంగా మొదటి విడుత పంపిణీ ప్రక్రియ
- రూ.లక్షలోపు అర్హుల జాబితాలో పేర్లు మాయం
- దివిటిపల్లి క్లస్టర్‌లో చనిపోయిన రైతుల పేర్లు
- రైతువేదికల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారుల నిలదీత
- ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని దాటవేత
- ప్రభుత్వ తీరుపై కర్షకుల అసహనం

మహబూబ్‌నగర్, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు అట్టహాసంగా ప్రకటించిన రుణమాఫీ పథకం ఆదిలోనే అబాసుపాలయ్యింది. రూ.2లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని గొప్పలు చెప్పి గురువారం రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసింది. అందులోనూ కొందరికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రచారం కొండంత చేసి గోరంత మాఫీ చేయడంతో రైతాంగం విస్తుపోతున్నది. అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో నిరాశకు గురై ఏ నిబంధనల ప్రకారం రుణమాఫీ చేశారో చెప్పాలని రైతువేదికల వద్ద సంబురాలకు వచ్చిన అధికారులను ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం దివిటిపల్లి క్లస్టర్‌లో కొంత మంది రైతులు చనిపోయిన వారి పేర్లు రుణమాఫీలో పేర్లు రావడం, బతికున్న తాము అర్హులము కాదా అంటూ నిలదీశారు. రుణమాఫీ కొంతమందికే ఇవ్వడం, మరో వైపు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించకపోవడంతో ఇదేం పాలన అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. రుణమాఫీ ఎందుకు కాలేదని అధికారులను నిలదీయగా, ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో జాబితా ప్రకటిస్తామని దాటవేశారు. వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్ల మధ్య సమన్వయలోపం కారణంగా చాలా మంది రైతుల పేర్లు మాయమైనట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఎంతమంది రుణమాఫీకి అర్హులనే విషయంపై అధికారులకే క్లారిటీ లేదు. రుణమాఫీ కోసం త్వరలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, అర్హులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయవచ్చని చెబుతున్నారు.

### మొదటి విడుత రుణమాఫీ వివరాలు..

రుణమాఫీ పథకంలో సవాలక్ష నిబంధనలు చాలా మంది రైతులకు శాపంగా మారాయి. ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారమే ప్రకటించామని అధికారులు చెబుతున్నా ఎక్కడా పొత్తు పొంతన లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 39,380 మంది రైతులకు సంబంధించి రూ.211కోట్లు జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు. వనపర్తి జిల్లాలో 28,408 మంది రైతులకు రూ.157 కోట్లు, జోగుళాంబ గద్వాల జిల్లాలో లక్షా 40వేల మందికి గానూ మొదటి విడుతగా 24,398 మంది రైతులకు రూ.144కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 46,708 మంది రైతులకు గానూ రూ.270కోట్లు, నారాయణపేట జిల్లాలో 28,684 మంది రైతులకు రూ.165 కోట్ల రుణమాఫీని బ్యాంకులకు చెల్లించినట్లు ప్రకటించారు.



### రైతువేదికల వద్ద తుస్సుమన్న సంబురాలు..

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయడంపై గురువారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలోని రైతు వేదికల వద్ద సంబురాలకు పిలుపునిచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు ఎక్కడికక్కడే వేదికల వద్ద సంబురాల్లో పాల్గొనాలని చెప్పారు. కాగా, రుణమాఫీ ప్రకటనలో గందరగోళం నెలకొనడంతో సంబురాలు తుస్సుమన్నాయి. మాకెందుకు రుణమాఫీ కాలేదని చాలా మంది రైతులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక మంత్రి, ఎమ్మెల్యేలు మాత్రం గత పాలనను విమర్శిస్తూ మమా అనిపించారు.

### ఎదిరలో చనిపోయిన రైతులకు వర్తింపు..

మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఎదిర గ్రామంలో 1,300 మంది రైతులు రూ.లక్షలోపు రుణమాఫీకి అర్హులు. అయినప్పటికీ కేవలం 635 మందికి మాత్రమే వర్తింపజేశారు. ఇందులో ముగ్గురు, నలుగురు చనిపోయిన రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో రాగా.. చాలా మంది అభ్యంతరం తెలిపారు. దాదాపు 70 శాతం మంది తమకు రుణమాఫీ వర్తింపజేయలేదని వాపోయారు. చనిపోయిన రైతులు అర్హులైనప్పుడు బతికున్న తాము ఎందుకు అర్హులం కాదంటూ అధికారులను ప్రశ్నించారు. రెండు, మూడెకరాలు ఉన్న రైతులకు మాత్రమే తొలి జాబితాలో స్థానం దక్కిందని, ఆగస్టు 15 వరకు దశలవారీగా రుణమాఫీ ఉంటుందని అధికారులు నచ్చజెప్పి పంపించారు. రుణమాఫీ అయ్యిందో లేదోనని చాలా మంది రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరగడం కనిపించింది.

## రైతులందరికీ మాఫీ చేయాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికి రుణమాఫీ చేసి, మరికొందరికి చేయకపోవడం సరికాదు. 2017లో రూ.80వేల రుణం తీసుకున్నా. రుణమాఫీ కాలేదు. 2018 నుంచి రుణం తీసుకున్న రైతులకే మాఫీ చేస్తే అంతకుముందు తీసుకున్న వారు రైతులు కాదా? రైతులందరికీ సమాన న్యాయం చేయాలి.

*- వీరేశ్, రైతు, తీలేరు, మరికల్ మండలం, నారాయణపేట జిల్లా*

## మేము రైతులం కాదా?



పంటేయనీకె రూ.45వేలు అప్పు తీసుకున్నా. కాంగ్రెస్ సర్కారు రూ.లక్షలోపు పైసలు మాఫీ చేస్తమని చెప్పిండు. సారోళ్లు ఇచ్చిన పేపర్లలో నా పేరు లేదంట. నేను రైతును కాదా. పంట కోసం అప్పు తీసుకునోళ్లందరికీ మాఫీ చేయాలే. పాత సర్కారోళ్లు చెప్పినకాడికి అందరికీ రుణం మాఫీ చేసింండ్రు. వీళ్లు మాట్కం కొందరికి ఇచ్చి మిగతోళ్లకు ఇయ్యమంటే బాగుండదు. మా బాధలను అర్థం జేస్కొని అప్పు మాఫీ చేయాలి.

*- గొల్ల రాములు, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా*

## సర్కారు మోసం చేస్తున్నది..



కర్షకులను కాంగ్రెస్ సర్కారోళ్లు మోసం చేస్తున్నరు. బ్యాంకులో అప్పు మాఫీ చేస్తమని ఏ లెక్కన పైసలు ఇస్తున్నరో తెలుస్తలేదు. నేను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.95వేల పంట రుణం తీసుకున్నా. రుణం మాఫీ చేసే లిస్టులో నా పేరు లేదు. ఎందుకు లేదంటే ఎవరూ ఏం చెప్తలేరు. రుణమాఫీ పేరుతో సర్కారు రైతులను మోసం చేస్తున్నది.

*- కురువ మద్దిలేటి, బుక్కాపురం, జోగులాంబ గద్వాల జిల్లా*

## మాఫీ అయ్యిందో లేదో తెలుస్తలేదు..



నాకు రెండెకరాల భూమి ఉన్నది. పత్తి పంట సాగు చేశా. అలంపూర్ గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.75 వేల పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ సర్కారోళ్లు ఇచ్చిన లిస్టులో నా పేరు లేదు. సారోళ్లను అడిగితే చెప్తలేరు. అప్పు మాఫీ అయ్యిందా, కాలేదా అనేది ఏం తెలుస్తలేదు.

*- బోయ మద్దిలేటి, బుక్కాపురం, జోగులాంబ గద్వాల జిల్లా*


ఉండవెల్లి : రుణమాఫీ సందర్భంగా మండలకేంద్రంలోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. అధికారులు, రైతులతో కలిసి ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించారు.

## రూ.40వేల రుణం మాఫీ కాలేదు..



కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన రుణమాఫీ గందరగోళంగా ఉంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీలకతీతంగా రైతుబంధుతోపాటు రుణమాఫీ చేశారు. కాంగ్రెస్ పాలనలో పారదర్శకంగా లేదు. కొత్తకోట ఏపీజీవీబీలో రూ.40వేల రుణం తీసుకున్నా. తీరా రుణమాఫీ లిస్టులో పేరు లేదు. కొందరికి మాఫీ చేసి ఇంకొందరికి ఎలా ఇవ్వరు.

*- నర్సింహాగౌడ్, కొత్తకోట, వనపర్తి జిల్లా*


నారాయణమూర్తిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## మెరుగైన వైద్యం అందించాలి

- ఆర్.నారాయణమూర్తిని పరామర్శించిన నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 18 : గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ హక్కుల కోసం ప్రజలను చైతన్యపరిచే ఎన్నో చిత్రాలు తీసి సందేశమిచ్చిన నారాయణమూర్తి ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. తనను పరామర్శించడానికి వచ్చిన నిరంజన్‌రెడ్డికి నారాయణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఆరోగ్యంగానే ఉన్నానని, దుష్ప్రచారాలను అభిమానులు, ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.


శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

## బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్, జూలై 18 : బీఆర్‌ఎస్ బాలానగర్ మండలాధ్యక్షుడు పుల్లమరాజు శ్రీనివాసరావు కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. శ్రీనివాసరావు తల్లి పద్మావతమ్మ (83) అనారోగ్యంతో ఈనెల 9వ తేదీన మృతిచెందారు. గురువారం దశదినకర్మ సందర్భంగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాసరావుతోపాటు సోదరుడు గోపాల్‌రావు, రాజారాంరావు, గిరిధర్‌రావు, చక్రధర్‌రావు, కుటుంబసభ్యులను ఓదార్చారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని చెప్పారు. అనంతరం జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు కోడ్గల్ యాదయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కల్యాణి, లక్ష్మణ్‌నాయక్, జీసీసీ మాజీ చైర్మన్ వాల్యానాయక్, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటాచారి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కూడా పరామర్శించారు.

## ప్రాజెక్టులకు భారీ వరద

ధరూరు/అయిజ, జూలై 18 : జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకున్నది. ఎగువ నుంచి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 25,174 క్యూసెక్కులను విద్యుదుత్పత్తికి వినియోగిస్తున్నారు. గురువారం నెట్టెంపాడుకు 1,500 క్యూసెక్కులు, భీమాలిఫ్ట్-1కు 1,300, ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 464, సమాంతర కాల్వకు 600, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులతో మొత్తం 30,013 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 2.053 టీఎంసీలు ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతున్నది. టీబీ డ్యాంలోకి 1,12,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 411 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ 105.788 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 50.025 టీఎంసీల నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి ప్రస్తుతం 1,615.67 అడుగుల నీటి మట్టం ఉంది.

## తొలిరోజు డీఎస్సీ ప్రశాంతం

- పర్యవేక్షించిన ఎస్పీ జానకి, డీఈవో రవీందర్

పాలమూరు, జూలై 18 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయం, జయప్రకాశ్‌నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డీఎస్సీ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అభ్యర్థులు ఉదయం 7 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. మొదటి షిఫ్ట్‌లో 364 మంది అభ్యర్థులకుగానూ 324 మంది హాజరుకాగా, 40 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 364 మంది అభ్యర్థులకు 323 మంది హాజరుకాగా, 41మంది గైర్హాజయ్యారు. ఫాతిమా విద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ పర్యవేక్షించారు.


అభ్యర్థుల హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న అధికారులు


కోడూరులో ట్రాన్స్‌ప్లాంటర్ మిషన్‌తో వరి నాట్లు వేస్తున్న రైతులు

## యంత్రసాగు.. బహుబాగు

పాలమూరు, జూలై 18 : ఆధునిక వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చని మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరుకు చెందిన నర్సయ్యగౌడ్ నిరూపిస్తున్నారు. గ్రామంలో గురువారం 20 ఎకరాల్లో కూలీలు లేకుండా రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌తో తక్కువ సమయంలో వరినాట్లు వేశారు. కూలీల కొరత ఎక్కువ కావడంతో రూ.3లక్షల 50వేలకు మిషన్‌ను కొనుగోలు చేశాడు. ఈ మిషన్ ద్వారా గంటకు రెండెకరాలు చొప్పున వరినాటు వేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా కూలీలు వరి నాటే సమయంలో కర్రలు తక్కువగా నాటడం వల్ల మళ్లీ నాటే పరిస్థితి ఉంటుందని, దీని ద్వారా కూలీల ఖర్చులు తగ్గడంతోపాటు క్రిమిసంహారక మందుల అవసరం రాదన్నారు. కలుపుతీతకు ఇబ్బందులు లేకుండా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.


వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశాకార్యకర్తలు

## ఆశల ఆగ్రహం

- కలెక్టరేట్లు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముట్టడి
- మేనిఫెస్టో హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్
- సంఘీభావం తెలిపిన సీఐటీయూ

*ప్రభుత్వంపై ఆశలు కన్నెర్ర చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకిచ్చిన హామీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని ధ్వజమెత్తారు. వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట కలెక్టరేట్లను, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలను ముట్టడించారు. అలాగే జడ్చర్ల, దేవరకద్ర, కల్వకుర్తిలో ఆందోళన చేపట్టి ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూలై 18*

## కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 18 : జూరాల జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం ఒక్క యూనిట్‌తో ప్రారంభమైన ఉత్పత్తి గురువారం సాయంత్రానికి నాలుగు యూనిట్లకు చేరుకున్నది. ఎగువ జూరాలలో 4 యూనిట్లు, దిగువ జూరాలలో 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఒక్కో యూనిట్‌ను పెంచుతున్నట్లు జెన్‌కో ఎస్‌ఈ కల్లూరి సుబ్బరామిరెడ్డి తెలిపారు.

